సాక్షి సిద్దిపేట

ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



తప్పని తిప్పలు

రామునిపట్ల- గోనెపల్లి మధ్య వాగు లో-లెవల్ వంతెన వల్ల ఎన్నో ఏళ్లుగా తిప్పలు తప్పడం లేదు.

వివరాలు 9లో ▸



చదువుల కోవెల

వర్గల్ నవోదయ విద్యాలయం

- అత్యున్నత ప్రమాణాలతో విద్యాబోధన
- గ్రామీణ విద్యార్థులకు ఆశాదీపం
- ఉచితంగా అన్ని రకాల మౌలిక వసతులు
- చదువుతోపాటు క్రీడల్లోనూ శిక్షణ
- పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం
- నూతన విద్యాసంవత్సరానికి దరఖాస్తులు స్వీకరణ

సండే స్పెషల్





కార్పొరేట్‌కు దీటుగా అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందిస్తూ విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేస్తోంది సిద్దిపేట జిల్లా వర్గల్ నవోదయ విద్యాలయం. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య.. నిష్ణాతులైన అధ్యాపకులు.. అధునాతన భవనాలు.. చక్కని సౌకర్యాలు.. ఆశ్రమ వసతులు.. స్మార్ట్ క్లాసులు.. క్రమశిక్షణాయుత విద్య.. విశాలమైన క్రీడా ప్రాంగణం.. ముప్పై ఎకరాల సువిశాల ప్రదేశం.. నందన వనం తలపించే వృక్ష సంపదతో అలరారుతున్న ఈ విద్యాలయం అన్ని రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతోంది. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, ఉజ్వల భవితకు సోపానంగా విలసిల్లుతుంది. ఇందులో ప్రవేశం లభించిందంటే చాలు భవిత ఉజ్వలమే అనే స్థాయిలో పేరొందింది.

– గౌరారం విజయరావు

వర్గల్(గజ్వేల్)

8లో

న్యూస్‌రీల్

పౌష్టికాహారంపై అవగాహన అవసరం

సీడీపీఓ ఎల్లయ్య



జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్న సీడీపీఓ ఎల్లయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలని సీడీపీఓ అధికారి ఎల్లయ్య అన్నారు. మిరుదొడ్డిలోని మహిళా సమైఖ్య భవనంలో శనివారం పోషణ్ మాసోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గర్భిణులు, తల్లులు, బాలింతలు, కిశోర బాల బాలికలకు పోషకాహారంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా అర్హులైన ప్రతీఒక్కరికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తూ, తల్లి పాల ప్రాముఖ్యతను వివరిస్తోందన్నారు. రక్తహీనత, చిన్న పిల్లల ఎదుగుదల లోపాలకు చెక్ పెట్టడానికి పోషణ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగుల గణేశ్‌రెడ్డి, ఎంపీఓ ఎండీ జహూరుద్దీన్, పీహెచ్‌సీ డాక్టర్ ఎండీ సమీనా సుల్తానా, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ వెంకట ప్రసాద్, దుబ్బాక బ్లాక్ కోఆర్డినేటర్ శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

రేషలైజేషన్ జీఓను ఉపసంహరించండి



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ నేతలు

మిరుదొడ్డి(దుబ్బాక): ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన రేషలైజేషన్ జీఓను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఇది ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసేలా ఉందని టీపీటీఎఫ్ (తెలంగాణ ప్రోగ్రెసీవ్ టీచర్స్ ఫెడరేషన్) జిల్లా కార్యదర్శి ర్యాకం మల్లేశం డిమాండ్ చేశారు. శనివారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ సింగిల్ లేదా డబుల్ టీచర్ల పాఠశాలల వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గిస్తే సర్కార్ బడులకు వచ్చే బడుగు బలహీన వర్గాల విద్యార్థులు విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల నిష్పత్తి ప్రకారం చూడకుండా తరగతుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను కేటాయించినప్పుడే ప్రాథమిక విద్యా వ్యవస్థ మెరుగు పడుతుందన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల అధ్యక్షులు అందె రామచంద్రం, పెరుమాండ్ల శ్రీనివాస్, నాయకులు రాజయ్య, నాగరాజు, రవి శేఖర్, దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ తనిఖీ



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): తల్లిదండ్రుల ఆశయాల కుణుగుణంగా ప్రతీ విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య ఆకాంక్షించారు. మండల పరిధిలోని అల్వాల-చెప్యాల క్రాస్ రోడ్డులో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయ బోధన తీరు, విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహార పదార్థాలు, వసతి గృహం, రికార్డులు, మురుగు కాలువ వ్యవస్థ, మరుగుదొడ్లు, మూత్రశాలలను ఆయన పరిశీలించారు. పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. నిబంధనల ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన మంచి పౌష్టికాహారాన్ని అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్: మోడల్ స్కూల్‌లో గంటల ప్రాతిపదికన బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.విశ్వనాథ్ శనివారం తెలిపారు. 9 నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ఇంగ్లిష్ బోధించాలని, అర్హత ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ, టెట్ ఉత్తీర్ణత సాధించి ఉండాలని పేర్కొన్నారు. 24వ తేదీ లోగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. 25న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఈసారి సగమే!

6.6 కోట్ల చేప పిల్లల పంపిణీకి మత్స్య శాఖ కసరత్తు

- ఈనెల 19న టెండర్లు ఓపెన్
- సిద్దిపేటలో ఇద్దరు, మెదక్‌లో నలుగురు
- సంగారెడ్డిలో ముందుకు రాని కాంట్రాక్టర్‌లు

సాక్షి, సిద్దిపేట: మత్స్యకారులకు ఉచితంగా పంపిణీ చేసే చేప పిల్లల్లో కోత పడనుంది. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం సగమే పంపిణీకి మత్స్య శాఖ కసరత్తు మొదలుపెట్టింది. చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతీ ఏడాది మే చివరిలో టెండర్ ప్రక్రియ పూర్తి అయ్యేది.. పంపిణీ సెప్టెంబర్ చివరి నాటికి తంతు ముగిసేది. ఈ ఏడాది ఇంకా టెండర్ ప్రక్రియనే కొనసాగుతుంది.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 4 వేలు చెరువులు

ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా 904 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు చెందిన 4,529 చెరువుల్లో చేపలు వదలనున్నారు. ఈ సంవత్సరం చేప పిల్లల పంపిణీ కోసం తొలుత ఆగస్టు 13న టెండర్లను ఓపెన్ చేయగా చేప పిల్లల సప్లయర్స్‌కు పెంపకం యూనిట్‌లు లేకుండా టెండర్లు వేశారని రద్దు చేశారు. తిరిగి సెప్టెంబర్ 9 నుంచి 19వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో టెండర్లు స్వీకరించారు. సిద్దిపేట జిల్లాలో ఇద్దరు, మెదక్‌లో నలుగురు టెండర్ వేయగా సంగారెడ్డిలో ఎవరూ టెండర్‌లు వేయలేదు. సిద్దిపేటలో చేప పిల్లల సరఫరా కోసం టెండర్లు వేసిన సప్లయర్స్ గురించి ప్రాథమిక పరిశీలన పూర్తి అయింది. మెదక్‌లో నలుగురు టెండర్లు వేయగా ప్రాథమిక పరిశీలనలోనే ఒకరు డిస్క్వాలిఫై అయ్యారు. సిద్దిపేట, మెదక్‌లకు చేప పిల్లల సరఫరా కోసం టెండర్లు వేసిన వాటిని ఫిజికల్‌గా వెళ్లి పరిశీలించనున్నారు. వారికి చేపల చెరువులు ఉంటేనే ఆ సప్లయర్స్ ఓకే అవుతాయి. లేకుంటే అవి సైతం డిస్క్వాలిఫై కానున్నాయి.

జిల్లా	చెరువులు	టెండర్లు (చేపపిల్లలు)	గత సంవత్సరం
సిద్దిపేట	1,715	2.21 కోట్లు	4.41 కోట్లు
మెదక్	1,654	2.62 కోట్లు	5.25 కోట్లు
సంగారెడ్డి	1,160	1.77 కోట్లు	3.56 కోట్లు

ప్రతీ ఏడాది ఆగస్టు వరకు పంపిణీ

చేప పిల్లల పంపిణీ కోసం ఏప్రిల్‌లో టెండర్ల ప్రక్రియ ప్రారంభమయ్యేది. ఆగస్టు వరకు చేప పిల్లల పంపిణీ కార్యక్రమం నిర్వహించేవారు. అలాంటిది సెప్టెంబర్ 21వ తేదీ దాటినా ఇంకా టెండర్ల ప్రక్రియే కొనసాగుతోంది. చెరువుల్లో 35 నుంచి 40ఎంఎం, 80 నుంచి 100 ఎంఎం పొడవున్న చేపపిల్లలను వదులుతారు. అవి కిలో సైజులో చేప పెరగాలంటే కనీసం 6 నుంచి 8 నెలల సమయం పడుతోంది. ఆగస్టులో వదిలితేనే జనవరి నుంచి ఫిబ్రవరి వరకు చేపలను పట్టి విక్రయించుకునే అవకాశం ఉంటుంది. చేప పిల్లలను ఆలస్యంగా వదిలితే ఎదుగుదలపై ప్రభావం పడనుంది. అక్టోబర్‌లో వదిలితే అవి కిలో సైజు పెరగాలంటే మార్చి దాటుతుంది. ఇంకా పెరగాలంటే వేసవి వచ్చేస్తుంది. ఉష్ణోగ్రతల కారణంగా చేపలు చనిపోయే ప్రమాదం ఉంటుందని పలువురు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



యేటా 13.22 కోట్ల చేప పిల్లలు

ప్రతీ ఏడాది 13.22కోట్ల చేప పిల్లలు ఉచితంగా పంపిణీ చేస్తే ఈ సారి 6.6 కోట్ల చేప పిల్లలే పంపిణీ చేయనున్నారు. అసలే చేపల పంపిణీ ఆలస్యం అవుతుంటే.... మరో వైపు సగానికి తగ్గించారు. సంగారెడ్డి జిల్లాలో చేపల పిల్లల సరఫరాకు కాంట్రాక్టర్‌లు ఎవరూ ముందుకు రాకపోవడంతో పంపిణీ ఉంటుందా ? ఉండదా? అని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఒకటి డిస్క్వాలిఫై



సిద్దిపేట జిల్లాలో చేపల పిల్లల పంపిణీ కోసం ఈనెల 19న టెండర్లు ఓపెన్ చేశాం. అందులో నలుగురు టెండర్ వేయగా ఒకరు డిస్క్వాలిఫై. ప్రాథమిక పరిశీలనలో ముగ్గురు ఓకే కాగా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు త్వరలో ఫిష్ సప్లయర్స్‌ను ఫిజికల్‌గా వెళ్లి పరిశీలిస్తాం. అంతా ఓకే అనుకుంటే త్వరలో చేపల పంపిణీ జరుగుతుంది.

– వరదారెడ్డి, ఎఫ్‌డీఓ

27న నంగనూరులో రైతు ధర్నా

ఎమ్మెల్యే హరీశ్‌రావు



టెలీకాన్ఫరెన్స్‌లో హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నందున అన్నదాతలకు అండగా ఉండాల్సిన అవసరం ఉందని, వారి తరపున పోరాటం చేద్దామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. శనివారం నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యనాయకులతో కలిసి ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా నంగనూరు వేదికగా ఈనెల 27న రైతులకు మద్దతుగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు రుణమాఫీ, రైతుబంధు, పంటలకు బోనస్ లాంటివి ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా ధర్నా సన్నాహక ఏర్పాట్లపై మాట్లాడారు. జిల్లాలో చాలా మంది రైతులకు రుణమాఫీ అమలు కాలేదని పలువురు నాయకులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం నామమాత్రంగా రుణమాఫీ అమలు చేసినట్టు విమర్శించారు. నిబంధనలు పెట్టి లబ్ధిదారుల సంఖ్యలో కోత విధించిందన్నారు. పెట్టుబడి సాయం అందక రైతులకు ఇబ్బంది వచ్చిందన్నారు.

ఆర్టిజన్‌లను రెగ్యులరైజ్ చేయాల్సిందే

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ కార్మికులను రెగ్యులరైజ్ (కన్వెన్షన్) చేయాలని తెలంగాణ విద్యుత్ జేఏసీ రాష్ట్ర జాయింట్ కార్యదర్శి చంద్రారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ కమిటీ పిలుపులో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్టిజన్‌లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆర్టిజన్ కార్మికులకు లబ్ధి చేసేలా సహకరించాలన్నారు.

జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా గుంటుపల్లి సుధాకర్

విద్యుత్ శాఖ నూతన జేఏసీ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుంటుపల్లి సుధాకర్, కన్వీనర్‌గా నాగ భైరయ్య, కో-చైర్మన్‌గా శ్రీనివాస్, కనకరాజు, కో-కన్వీనర్‌గా సందీప్, జాయింట్ సెక్రటరీలుగా రవికుమార్, మోహన్, జైపాల్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సీతారాములు, సరిత, కోశాధికారిగా శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్‌గా దూలం యాదగిరి గౌడ్‌లను ఎన్నుకున్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి



జిల్లా కోర్టు ఆవరణలో స్వచ్ఛతా హీ సేవాలో న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది తదితరులు

సిద్దిపేటకమాన్: ప్రజలందరూ తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. కోర్టు ఆవరణలో చెత్త, ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లను తొలగించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లాలోని సిద్దిపేట కోర్టుతో పాటు గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక కోర్టులలో ప్లాస్టిక్‌ను నిషేధిస్తామన్నారు. మన పూర్వకాలం నుంచి వస్తున్న సంప్రదాయాలను మనం పాటిస్తే స్వచ్ఛ భారత్ కల సాకారమవుతుందన్నారు. నేటి నుంచి వచ్చే నెల 1 వరకు ఈ కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే దోమలు దరిచేరవన్నారు. దీంతో ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు స్వాతిరెడ్డి, మిలింద్ కాంబ్లి, శ్రావణియాదవ్, చందన, శివరంజని, కృష్ణతేజ, ప్రియాంక, సౌమ్య, బార్ అసోసియేషన్ సెక్రటరీ మంతూరి సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు సాయిబాబ, వై రాజేశ్వర్‌రెడ్డి, రాజలింగం, మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్, మున్సిపల్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటమి గెలుపునకు నాంది



క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): క్రీడల్లో గెలుపు ఓటములు సహజమైనప్పటికీ, ప్రతీ క్రీడాకారుడు ఓటమిని గెలుపునకు పునాదిగా మార్చుకోవాలని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ఐ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) మండల స్థాయి క్రీడోత్సవాలు శనివారం ముగిశాయి. వివిధ క్రీడల్లో గెలుపొందిన క్రీడా జట్లకు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఆయన బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం అక్బర్‌పేట-భూంపల్లి మండల పీఆర్‌టీయూ నాయకులు ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డిని సన్మానించారు.

నాయకత్వ లక్షణాలకు క్రీడలు దోహదం

దుబ్బాకటౌన్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటే నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని జీవితంలో వివిధ రంగాల్లో ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం రాయపోల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల ముగింపులో ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసికోల్లాసం కలుగుతోందన్నారు. అలాగే నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చడానికి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలను ప్రతీ సంవత్సరం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు.

దౌల్తాబాద్(దుబ్బాక): దేశభవిష్యత్ నిర్మించబడేది తరగతి గదిలోనేనని ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మండలంలోని లింగరాజ్‌పల్లిలో ఉన్న మహాత్మాజ్యోతిరావు పూలే బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు.

మైనర్ డ్రైవింగ్ కేసులు 798 : సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: మైనర్ డ్రైవింగ్ చేసే వారిపై, మైనర్లకు వాహనాలు ఇస్తున్న తల్లిదండ్రులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని సిద్దిపేట సీపీ అనురాధ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్ చట్టప్రకారం నేరమన్నారు. జనవరి నుంచి ఇప్పటివరకు మైనర్ డ్రైవింగ్ చేసే వారిపై 798 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన వాహనదారులు, వారి తల్లిదండ్రులకు ట్రాఫిక్ పీఎస్‌లో కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు.

సీపీని కలిసిన ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ

సిద్దిపేట పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధను ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రజలకు అందుతున్న ప్రభుత్వ వైద్యసేవల గురించి సీపీ అడిగి తెలుసుకున్నారు.

రైల్వేస్టేషన్‌లకు బస్సు సౌకర్యం కల్పించండి

గజ్వేల్: గజ్వేల్, సిద్దిపేట రైల్వేస్టేషన్‌లకు వెళ్లడానికి రవాణా సౌకర్యాలు లేనందు వల్ల ప్రయాణికులు రైలు సేవలను ఉపయోగించుకోలేకపోతున్నారని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహన్ రావు అన్నారు. శనివారం 'సాక్షి' మెయిన్ పేజీలో మనోహరాబాద్-గజ్వేల్-సిద్దిపేట రైల్వేలైన్ తీరుపై 'స్పీడ్ తక్కువ... సమయం ఎక్కువ' శీర్షికన ప్రచురితమైన కథనం నేపథ్యంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ జీవీఎస్‌ఎస్ పవన్‌ను కలిసి ఆయన సమస్యను వివరించారు. కేవలం రూ. 30తో సిద్దిపేట నుంచి, రూ. 20తో గజ్వేల్ నుంచి సికింద్రాబాద్‌కు రైలులో వెళ్లే అవకాశమున్నా ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వాడుకోలేకపోతున్నారని తెలిపారు. రైల్వేస్టేషన్‌లు దూరంగా ఉండటమే కారణమన్నారు.

పీజీటీ నాగరాజుకు రాష్ట్రస్థాయి పురస్కారం



నాగరాజు

దుబ్బాక: మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్ పీజీటీ (పొలిటికల్ సైన్స్ టీచర్) రాధారి నాగరాజు శాలివాహన విశిష్ట ప్రతిభా పురస్కారం-2024 రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. రెండు రాష్ట్రాల్లో పనిచేస్తున్న టీచర్స్ శాలివాహన చారిటబుల్ ట్రస్టు ఈ అవార్డుకు ఎంపిక చేసింది. నాగరాజు 2016లో ఉమ్మడి మెదక్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2019లో మహాత్మాపూలే ఉపాధ్యాయ అవార్డు, 2022లో జాతీయ స్థాయిలో స్వచ్ఛ విద్యాలయం పురస్కారం అందుకున్నారు. సిద్దిపేటలో పర్యావరణ హిత కార్యక్రమాలతో పాటు వృక్షబంధన్ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారు. అనేక సామాజిక కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ చేస్తున్న సేవలకు గాను అవార్డు వరించింది.

22 పంచాయతీల సంగతేంటీ?

- ఇంకా ప్రచురించని ముసాయిదా
- నేటికీ పరిష్కారం కాని టెక్నికల్ సమస్య
- మిగతా 499 పంచాయతీల్లో ముగిసిన ఓటరు అభ్యంతరాల స్వీకరణ
- 28న తుదిజాబితాకు కసరత్తు



సిద్దిపేట రూరల్ మండలంలో 22 గ్రామ పంచాయతీలకు ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించలేదు. టెక్నికల్ సమస్యే కారణమని అధికారులు చెబుతున్నారు. దీంతో జాబితా ఎప్పుడు ప్రచురణ అవుతుంది? తమ పరిస్థితి ఏమిటని ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు మిగతా 499 పంచాయతీలకు ముదాయిదా ప్రచురణ కావడం, శనివారం అభ్యంతరాలు తంతు కూడా పూర్తికావడం జరిగింది. ఇక తుది ఓటరు జాబితాకు కసరత్తు జరగనుంది.

సిద్దిపేటరూరల్: జిల్లాలోని 23 మండలాలకు గాను సిద్దిపేట రూరల్ మండలానికి సంబంధించి టెక్నికల్ సమస్య తలెత్తింది. ఈ కారణంగా మండల వ్యాప్తంగా ఉన్న 15 గ్రామ పంచాయతీలతోపాటు మల్లన్నసాగర్ ముంపునకు గురైన 7 గ్రామాల వారి ఓటరు జాబితా కూడా నమోదు కాలేదు. ఆయా గ్రామాల్లోని ఓటర్ల నమోదు కాకపోగా గ్రామ పంచాయతీల వద్ద ఎలాంటి ఓటరు జాబితా ప్రదర్శన చేయలేదు. దీంతో గ్రామాల వారీగా ఉన్న ఓటర్లలో సందిగ్ధత నెలకొంది. జిల్లావ్యాప్తంగా 507 గ్రామపంచాయతీలకు గాను 6 లక్షల 16 వేల 9 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 3,03,141 మంది, మహిళలు 3,12,861 మంది ఉన్నారు.

సవరణలు లేవు.. అభ్యంతరాల స్వీకరణలూ లేవు

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పంచాయతీల్లో, మున్సిపాలిటీల్లో ఈనెల 13న ఓటరు జాబితాను ప్రదర్శించారు. దీంతో నూతనంగా ఓటరుగా నమోదైన వారు, మార్పులు చేర్పులు, వంటివి పరిశీలన చేసుకున్నారు. కాని రూరల్ మండలంలోని 15 గ్రామాలతో పాటుగా ముంపుకు గురైన 7 గ్రామాల ఓటర్ల జాబితాను ప్రదర్శించలేదు. దీంతో ప్రజలు వారి ఓటు వివరాలు తెలియక, ఓటుకు సంబంధించిన సవరణలు, అభ్యంతరాలను తెలియజేసేందుకు వీలులేకుండా పోయింది.

ఎదురుచూపులు..

రూరల్ మండలవ్యాప్తంగా ఓటరు జాబితా రాక కోసం గ్రామాల్లోని ఓటర్లు, రాజకీయ నాయకులు ఎదురుచూపులు చూస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం త్వరలో నోటిఫికేషన్ రానున్న క్రమంలో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేయదలచుకునే వారు ఓటరు జాబితా కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

వార్డులవారీగా జాబితా సిద్ధం



ఓటర్ల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియకు స్టేట్ సైట్ నుంచే సమస్య ఎదురైంది. అన్ని గ్రామ పంచాయతీల్లో వార్డులవారీగా ఓటర్ల వివరాలను సర్వం సిద్ధం చేశాం. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియే పెండింగ్‌లో ఉంది.

– మురళీధర్‌శర్మ, ఎంపీడీఓ సిద్దిపేటరూరల్

ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం



ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి సమస్య ఉంది. దీంతో పరిష్కారం కోసం ఎప్పటికప్పుడూ ఉన్నతాధికారులను అడిగి తెలుసుకుంటున్నాం. ఆన్‌లైన్ నమోదు సమస్య క్లియర్ కాగానే నమోదు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– దేవకీదేవి, జిల్లా పంచాయతీ అధికారి

క్లుప్తంగా

కాళోజీ పురస్కారానికి ఎంపిక


సూర్య ప్రకాశ్ రావు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మండలం కాగజ్ మద్దూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఫిజిక్స్ ఉపాధ్యాయుడు, కవి, రచయిత. డాక్టర్ రాయారావు సూర్య ప్రకాశ్ రావు తెలంగాణ మహిళ సాహిత్య సంస్కృతి సంస్థ అందించే కాళోజీ పురస్కారానికి ఎంపికయ్యారు. 22న ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని భారత్ స్కౌట్ భవనంలో జరిగే కార్యక్రమంలో పురస్కారం అందుకోనున్నారు. ఈ సందర్భంగా సూర్య ప్రకాశ్ రావు మాట్లాడుతూ.. నా కవితలు, రచనలను గుర్తించి కాళోజీ పురస్కారానికి ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి పురస్కారాలతో మరిన్ని కవితలు, రచనలను భావితరాలకు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కాగజ్ మద్దూర్ గ్రామస్తులతోపాటు ఉపాధ్యాయులు , విద్యార్థులు, ఆయా పార్టీల రాజకీయ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

కమిషన్ సభ్యుడు ప్రసాద్ రావు

రామచంద్రపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్‌లో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు ప్రసాదరావు అన్నారు. బీహెచ్ఈఎల్ ఎస్సీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్ ప్రధాన కార్యదర్శి దేవా అర్జున్ శనివారం ప్రసాద్ రావును ఆయన నివాసంలో కలిశారు. బీహెచ్ఈఎల్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. బీహెచ్ఎల్ ఉద్యోగులకు, కార్మికులకు అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మనోజ్ కుమార్, ఎస్టీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: పెద్ద చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ పట్టణంలోని పెద్ద చెరువు వద్ద శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం నీటి పై తేలుతూ కనిపించింది. స్థానికులు మున్సిపల్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని బయటకు తీయించి పరిశీలించారు. చనిపోయిన వ్యక్తి వయస్సు 40 నుంచి 45 ఏళ్లు ఉంటాయని తెలిపారు. మృతదేహం గుర్తుపట్టలేనంత కుళ్లినస్థితిలో ఉందన్నారు. బంధువులు ఎవరైనా ఉంటే అమీన్‌పూర్ పోలీసులను సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


నవోదయలో విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్

చదువుల కోవెల

వర్గల్ నవోదయ విద్యాలయం | ఉన్నత విద్య.. ఉజ్వల భవిత



వర్గల్(గజ్వేల్): కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ 1987లో సిద్దిపేట జిల్లా వర్గల్‌లో నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేసింది. కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నే స్థాయిలో అకడమిక్ బ్లాక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, బాల బాలికలకు వేర్వేరుగా డార్మెటరీలు, డైనింగ్ హాల్స్, బోధన, బోధనేతర సిబ్బందికి క్వార్టర్ల సముదాయం, క్రీడా మైదానం, జనరేటర్, స్టాఫ్‌నర్స్‌తో మెడికల్ అసిస్టెన్స్ విభాగం, రవాణాకు ప్రత్యేక వాహనం, చుట్టూరా కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేశారు. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, సెక్యూరిటీ స్టాఫ్ నియమితులయ్యారు. పర్యావరణ హితమైన పచ్చని వృక్ష సంపద, అంతర్గత సీసీ రోడ్లు, స్ట్రీట్‌లైట్లు, ఆహ్లాదం పంచే పార్కుతో విద్యాలయం అలరారుతుంది.

సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం..

త్రిభాషా సూత్రం ప్రాతిపదికన సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం 6 నుంచి 12వ తరగతి వరకు విద్యాబోధన జరుగుతుంది. ఎంట్రెన్స్ పరీక్ష ద్వారా ప్రతీ యేటా 80 మంది బాలబాలికలకు ఆరో తరగతిలో ప్రవేశం కల్పిస్తారు. ఆశ్రమ వసతులతో క్రమశిక్షణాయుత విద్య, స్మార్ట్ క్లాసులు, డూయిండ్ బై లెర్నింగ్, ప్రాక్టికల్ బోధన, సైన్స్, మ్యాథ్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీ, తగిన సంఖ్యలో బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు. విద్యార్థులపై నిరంతర నిఘా ఉంటుంది. తరగతి గదుల్లో పాఠాలు, అధ్యాపకుల పర్యవేక్షణలో స్టడీ అవర్స్ కొనసాగుతాయి. విద్యార్థుల్లో జాతీయ సమైక్యత భావం పెంపొందింపజేసేందుకు మైగ్రేషన్ విధానం అమలు చేస్తారు. ఇందులో భాగంగా తొమ్మిదో తరగతి చదువుతున్న 21 మంది వర్గల్ విద్యార్థులు ఏడాది పాటు హర్యానాలోని హిస్సార్ నవోదయలో, అక్కడి నుంచి వచ్చే 21 మంది విద్యార్థులు ఇక్కడ చదువు కొనసాగిస్తారు.


నవోదయలో కంప్యూటర్ ల్యాబ్

వసతులన్నీ ఉచితమే

విద్యాలయంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు తదితర వసతులన్నీ ఉచితమే. బాలికలు, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందినవారు, వికలాంగులు, దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాలకు ఎలాంటి ఫీజు లేదు. ఇతర వర్గాలకు చెందిన విద్యార్థులైతే 9 నుంచి 12వ తరగతి వరకు నెలకు రూ.200 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. సుశిక్షితులైన అధ్యాపకులు, వ్యాయామోపాధ్యాయుల శిక్షణలో రాటు దేలిన ఇక్కడి విద్యార్థులు చదువుల్లో, ఆటల్లో అత్యుత్తమ ప్రతిభతో ఉన్నత శిఖరాలు అధిరోహించారు.

చదువుతో పాటు ఆటలు, పాటలు

చదువుతోపాటు ఆటలు, పాటలకు ప్రాధాన్యత ఉంటుంది. అభిరుచికి తగిన ఇతర రంగాల్లోనూ విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారి సర్వతోముఖాభివృద్ధికి నవోదయ కృషి చేస్తుంది. రాష్ట్రంలోనే అత్యుత్తమమైన 400 మీటర్ల ట్రాక్‌తో కూడిన స్టేడియం, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖో ఖో కోర్టులు, జిమ్ ఉన్నాయి. ఆటల్లో శిక్షణ కోసం వ్యాయామోపాధ్యాయులు, సంగీత శిక్షణకు మ్యూజిక్ టీచర్, డ్రాయింగ్‌లో ప్రావిణ్యత పెంచేందుకు డ్రాయింగ్ మాస్టర్ ఉన్నారు. ఎన్‌సీసీ, స్కౌట్స్ విభాగాలతో స్వయంకృషి, సేవాభావం విద్యార్థుల్లో పెంపొందింపజేస్తున్నారు.


మార్షల్ ఆర్ట్స్ శిక్షణలో నవోదయ బాలికలు

బ్యాండు బృందం


ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ



2025- 26 విద్యాసంవత్సరం ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష కోసం అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా 23 (సోమవారం) వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థి ఉమ్మడి మెదక్ జిల్లా(సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట)లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతూ ఉండాలి. ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 3, 4 తరగతులు పూర్తి విద్యాసంవత్సరం చదివి, ఉత్తీర్ణులై ఉండాలి. 2013, మే ఒకటో తేదీ నుంచి 2015 జూలై 31 మధ్య (రెండు దినములు కలుపుకొని) జన్మించి ఉండాలి. జనవరి 18న ప్రవేశ పరీక్ష జరుగుతుంది. http://navodaya.gov.in వెబ్‌సైట్ సందర్శించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

– రాజేందర్, నవోదయ ప్రిన్సిపాల్

దూరమనే బాధ లేదు



నేను హర్యాన రాష్ట్రం హిస్సార్ జిల్లా నవోదయ విద్యార్థిని. మైగ్రేషన్ విధానంలో భాగంగా నాతోపాటు 21 మంది విద్యార్థులం వర్గల్ నవోదయలో చదువుకుంటున్నాం. ఇరవై నాలుగు గంటల రైలు ప్రయాణం, న్యూఢిల్లీ ఆవల 1,500 కిలోమీటర్లు పైగా దూరం నుంచి వచ్చినప్పటికీ మాకు దూరమనే భావన, బాధలేదు. మా భోజన అలవాట్లకు అనుగుణంగా ఇక్కడ చపాతి ఇస్తున్నారు. ఇక్కడి సంస్కృతి కొత్త అనుభూతి పంచుతుంది. మేము ఉండే సంవత్సర కాలంలో తెలుగు పదాలను నేర్చుకునే ప్రయత్నం చేస్తాం.

మేఘ, హర్యాన రాష్ట్రం


అసెంబ్లీ సెషన్

అలా మొదలై..

ఇలా ముగుస్తుంది

వీడుతున్న చీకటి తెరలు.. తెల్లారిందన్నట్లు పక్షుల కిలకిలారావాలు.. ఠంగుమంటూ వర్గల్ నవోదయ విద్యాలయలో మోగిన ఘంట.. అయిదవుతోంది నిద్రలేవండి అంటూ చౌకీదార్ కేకలు, విజిల్ శబ్దాలు.. ఆ వెంటనే ఊరు నిద్రలేచిందన్నట్లు డార్మెటరీలలో విద్యార్థుల సందడి.. ఒకరినొకరు తట్టిలేపుకోవడాలు.. అలా మొదలవుతుంది నవోదయలో విద్యార్థుల దినచర్య.. అంతే వేగంగా ట్రాక్‌సూట్ ధరించి తెల్లారి 5.30 గంటల వరకు బాల బాలికలందరూ క్రీడాప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడ పురుష, మహిళ వ్యాయామోపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థుల్లో చురుకుదనం పెంచేలా 45 నిమిషాల పాటు జాగింగ్, రన్నింగ్, యోగాసనాలు, వామప్స్ తదితర ఫిజికల్ ఎక్సర్‌సైజెస్ సెషన్ కొనసాగింది. ఉదయం 6.15 గంటల నుంచి 7.00 గంటల వరకు డార్మెటరీల్లో విద్యార్థులు స్నానపానాది కాలకృత్యాలు తీర్చుకొని మెస్ సిబ్బంది సిద్ధం చేసిన బోర్న్‌విటా, హార్లిక్స్, పాలు, బిస్కట్లు తీసుకున్నారు. ఉరకలేస్తున్న ఉత్సాహంతో తరగతి గదులకు పరుగులు తీశారు.



వర్గల్ నవోదయ ప్రాంగణంలో హర్యాన రాష్ట్ర విద్యార్థుల బృందం

7.15 గంటలకు ప్రేయర్ సెషన్ అసెంబ్లీ

మల్టీపర్పస్ హాల్ వేదికగా విద్యార్థులు అసెంబ్లీ కాగా ఉదయం 7.15 గంటలకు ప్రేయర్ సెషన్ మొదలై అరగంట కొనసాగింది. అధ్యాపకుల పర్యవేక్షణలో నిమిషం పాటు విద్యార్థుల మౌన ప్రార్థన, అనంతరం 'హమ్ నవయుగ్ కీ నయీ భారతీ' అంటూ నవోదయ గీతాలాపన, భారత దేశం నా మాతృభూమి అంటూ 'ప్రతిజ్ఞ' చేశారు. థాట్ ఫర్ ది డే, వార్తలు, ప్రశ్నావళి(క్విజ్), స్పెషల్ టాక్, మాస్టర్ ఆన్ డ్యూటీ ప్రసంగం, ప్రిన్సిపాల్ ప్రసంగం, బర్త్‌డే సెలబ్రేషన్స్ సాంగ్, జాతీయ గీతాలాపనతో అసెంబ్లీ ముగిసింది.

7.45 నుంచి క్లాసులు షురూ

ప్రేయర్ సెషన్ నుంచి 7.45 గంటలకు విద్యార్థులు తరగతి గదులకు చేరుకోగానే టీచింగ్ సెషన్ మొదలై మధ్యాహ్నం 1.30 వరకు తరగతులు కొనసాగాయి. మధ్యలో 9.05 నుంచి 9.50 వరకు బ్రేక్ ఫాస్టు, 11.35 నుంచి 10 నిమిషాలు షార్ట్ బ్రేక్ ఇచ్చారు.



1.30కు లంచ్ బ్రేక్

అకాడమిక్ బ్లాక్‌లో క్లాసెస్ ముగిసిన వెంటనే మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి లంచ్ బ్రేక్ ఇచ్చారు. బాలబాలికలు తమతమ భోజన శాలలకు చేరిపోయారు. అక్కడ సిద్ధంగా ఉన్న రుచికరమైన వంటకాలతో భోజనం ముగించుకున్నారు. డార్మెటరీలకు చేరిపోయారు.

3.00 గంటలకు 'స్టడీ అవర్'

మధ్యాహ్న విరామం అనంతరం 3.00 గంటలకు స్టడీ అవర్ మొదలైంది. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో 4.30 వరకు కొనసాగిన ఈ సెషన్‌లో విద్యార్థులు తమ సందేహాలు నివృత్తి చేసుకున్నారు. వీక్ స్టూడెంట్స్ చదువులో మెరుగుపడేలా సూచనలిచ్చారు. స్టడీ అవర్ తర్వాత 15 నిమిషాలు టీ బ్రేక్ ఇచ్చి.. పిల్లలకు టీ, స్నాక్స్ పంపిణీ చేశారు.

5.00 గంటలకు గేమ్స్ సెషన్

మానసికోల్లాసాన్ని, ఆనందాన్ని పంచే ఆటల సెషన్ ప్లేగ్రౌండ్ వేదికగా సాయంత్రం 5.00 గంటల నుంచి 6.00 వరకు కొనసాగింది. రన్నింగ్, కబడ్డీ, ఫుట్‌బాల్ తదితర ఆటల్లో మునిగితేలారు.

6.30 గంటలకు సెల్ఫ్ స్టడీ సెషన్

సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు సెల్ఫ్ స్టడీ సెషన్ కొనసాగింది. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో బాలికలు తమ డైనింగ్‌హాల్‌లో, బాలురు అకాడమిక్ బ్లాక్‌లో సెల్ఫ్‌స్టడీ చేశారు. ఆ తర్వాత రాత్రి 8.45 వరకు విద్యార్థులు భోజనాలు ముగించుకున్నారు.

'లోకో పేరెంట్' కౌన్సెలింగ్

భోజనం తర్వాత బాల బాలికలు డార్మెటరీలకు చేరుకోగానే, హౌజ్ మాస్టర్లు రాత్రి 9.00 గంటలకు అక్కడికి చేరుకొని అటెండెన్స్ తీసుకుంటారు. అరగంట పాటు 'లోకో పేరెంట్'గా పిల్లలతో కలిసిపోయి తండ్రిలాగా వారి ఇబ్బందులు తెలుసుకుంటారు. క్లీనింగ్, హెల్త్ కండిషన్ వాకబుచేసి తగు సూచనలు, సలహాలు ఇచ్చి వారిలో ఆందోళన తొలగిస్తారు. తాము తల్లిదండ్రులకు దూరంగా ఉన్నామనే భావన విద్యార్థులలో తొలగించేందుకు లోకో పేరెంట్ ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. ఆ తర్వాత 9.15 నుంచి 10.30 వరకు సెల్ఫ్ స్టడీ, ఆ తర్వాత నిద్రకు ఉపక్రమించడంతో దినచర్య ముగుస్తుంది.


నవోదయలో తర్ఫీదు పొందుతున్న గిటార్ బృందం

ఆటోను ఢీకొట్టిన బైక్

● ఒకరు మృతి, మరొకరికి గాయాలు


మహ్మద్ ఖమర్ (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): ఆటోను బైక్ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని ముప్పారం గ్రామ శివారులో 161 జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం మేరకు.. టేక్మాల్ గ్రామానికి చెందిన అరవింద్, మహ్మద్ ఖమర్(55)తో కలిసి బైక్‌పై పెద్దశంకరంపేటకు వెళ్లారు. తిరిగి టేక్మాల్‌కు వెళ్తుండగా ముప్పారం శివారులో ముందు వెళ్తున్న ఆటోను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా అంబులెన్స్‌లో జోగిపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మహ్మద్ ఖమర్ మృతి చెందాడు. అరవింద్ చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడి భార్య ఫరీనా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారును ఢీకొట్టిన మరో కారు

కొండపాక(గజ్వేల్): అతివేగంగా వచ్చిన కారు రోడ్డు పక్కన పార్కు చేసిన మరో కారును ఢీకొట్టింది. ఈ ఘటన మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ నుంచి నలుగురు కారులో సిద్దిపేట వైపునకు వెళ్తున్నారు. తిమ్మారెడ్డిపల్లి నుంచి కొండపాకకు వెళ్లేందుకు రాజీవ్ రహదారిపై ఉన్న వైజంక్షన్ వద్ద టీ తాగేందుకు కొందరు కారును పార్కు చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చిన కారు పార్కు చేసిన కారును బలంగా ఢీకొట్టింది. దీంతో కారు రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. రెండు కార్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి.

పెట్టుబడుల పేరుతో భారీ మోసం

● రూ.15 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

తూప్రాన్: పెట్టుబడి పేరుతో సైబర్ నేరగాళ్లు భారీ మోసానికి పాల్పడ్డారు. ఓ వ్యక్తి నుంచి ఏకంగా రూ.15 లక్షల వరకు కాజేశారు. ఈ ఘటన శనివారం తూప్రాన్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. పట్టణంలోని అరకలవాడలో నివాసం ఉంటున్న బరాధార్ దేవానంద్ జూలై 11న గూగుల్ ద్వారా షార్‌వేస్ ఇన్వెస్ట్‌మెంట్‌లో డబ్బులు పెట్టుబడి పెట్టేందుకు సెర్చ్ చేశాడు. ఎస్ఎంసీ క్యాపిటల్స్ పేరు తో ఓ మేసేజ్ వచ్చింది. ఇందులో పెట్టుబడి పెడితే అధికంగా డబ్బులు వస్తాయని సైబర్ నేరగాళ్లు నమ్మబలికారు. ఇది నమ్మిన బాధితుడు వారు చెప్పినట్లుగా ఆయా అకౌంట్లకు పలు దఫాలుగా అదే నెల 31న రూ.10.94 లక్షలు పంపించాడు. సెప్టెంబరు 17న తన అవసరం నిమిత్తం డబ్బులు తీసుకుందామని వారిని ఫోన్ ద్వారా సంప్రదించాడు. మరో రూ.4 లక్షలు పంపితే డబ్బులు డ్రా చేసుకోవచ్చని చెప్పడంతో వారి మాటలు మళ్లీ నమ్మి డబ్బులు పంపించాడు. అనంతరం మరో కొంత డబ్బు పంపిస్తే మొత్తం డబ్బులు డ్రా చేసుకోవచ్చని తెలుపడంతో తాను మోసపోయినట్లు గుర్తించాడు. పోలీసులను ఆశ్రయించగా బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


శ్రీనివాస్ (ఫైల్)


గాయాలతో కుమార్

నర్సాపూర్ రూరల్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్ పంచాయతీ పరిధిలోని అర్జుతండాలో చోటు చేసుకుంది. నర్సాపూర్ ఎస్సై లింగం కథనం మేరకు.. తండాకు చెందిన హలావత్ శ్రీనివాస్ (41) శ్రీనివాస్ తండ్రి లచ్చయ్య అనారోగ్యం పాలైనప్పుడు చికిత్స కోసం రూ.4 లక్షల వరకు అప్పులు చేశాడు. అవి తీర్చే మార్గం లేక శనివారం ఉదయం ఇంటి వెనుకాల ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం

పెద్దశంకరంపేట(మెదక్): ఒంటిపై పెట్రోల్ పోసుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పెద్దశంకరంపేటలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పేటలోని వడ్డెర వాడకు చెందిన ఎల్గోయి కుమార్(38) భార్యతో గొడవపడ్డాడు. క్షణికావేశంలో తన కాలనీకి వెళ్లే మార్గంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. ఎస్ఐ శంకర్ విషయం తెలుసుకొని తీవ్రగాయాలైన కుమార్‌ను హైవే అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం


మల్లేశ్ గౌడ్

పటాచెరుటౌన్: వ్యక్తి అదృశ్యమైన ఘటన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మల్లేశ్ గౌడ్(30) గుమ్మడిదల టోల్ ప్లాజా సమీపంలోని తన దాబాకు శుక్రవారం వెళ్లాడు. కొద్దిసేపటికి భార్య మాధురి ఇంటికొస్తున్నారా.. అని మెసేజ్ పెట్టింది. నా కోసం ఏడ్చే ఏడుపు ఈ రోజుతోనే ఎండ్ అవ్వాలని మెసేజ్ ఇచ్చాడు. కంగారు పడిన మాధురి దాబాలో పని చేసే వాళ్లకు ఫోన్ చేయగా, పది నిమిషాలు ఉండి వెంటనే వెళ్లిపోయాడని తెలిపారు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులతో కలిసి చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త అదృశ్యంపై మాధురి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పిడుగుపాటుకు 20 మేకలు మృత్యువాత


మృతి చెందిన మేకలు

కల్హేర్(నారాయణఖేడ్): పిడుగుపాటుకు మేకలు మృత్యువాత పడిన ఘటన శనివారం సాయంత్రం నిజాంపేట మండలం నాగధర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు దుద్యాల మాణిక్యం మేకలను అటవీ ప్రాంతంలో మేపేందుకు తీసుకెళ్లాడు. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. మేకల మందను ఓ చెట్టు కింద నిలిపాడు. ఒక్కసారిగా పిడుగుపడటంతో మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో చెట్టు కింద ఉన్న మాణిక్యం తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ప్రభుత్వం నుంచి సాయం అందించాలని బాధితుడు కోరాడు.